చారిత్రక సంపద.. చూసొద్దాం రండి

- జిల్లాలో ఆదిమానవుల అడుగుజాడలు
- వేంగి రాజుల వైభవ చిహ్నాలు
- రాచరికపు గుర్తులు
- ఏలూరులో ఆకర్షిస్తున్న పురావస్తు ప్రదర్శన శాల
- జనవరిలో ప్రారంభానికి ఏర్పాట్లు


వేంగి చాళుక్యుల కాలం నాటి రాతి మండపం


నిజాం కాలం నాటి కత్తులు, శిరస్త్రాణం, డాలు




క్యూర్ కోడ్ స్కానింగ్ ద్వారా చరిత్ర తెలుసుకునే వెసులుబాటు, పురాతన కాలం నాటి తామ్ర పత్రాలు, కాంస్య లోహ పురాతన ప్రతిమలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్రీస్తు పూర్వమే ఏలూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆది మానవుడు నడయాడినట్టు చరిత్ర చెబుతోంది. దీనికి పురావస్తు శాఖ స్పష్టమైన ఆధారాలు వెలికితీసింది. ఆదిమానవుడు వినియోగించిన ఉపకరణాలను శోధించి సాధించింది. రాచరికపు వైభవాన్ని చవిచూసిన ఈ ప్రాంతానికి చెందిన గురుతులనూ వెతికిపట్టుకుంది. ఇవన్నీ ఏలూరులో ఏర్పాటు చేసిన పురావస్తు ప్రదర్శన శాలలో ప్రత్యక్షమయ్యాయి.


అష్టదిక్పాలకుల స్థంభం

ఇక్కడికి వెళితే కాలం తెలియదంతే..

ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవాలనేదే మానవ జిజ్ఞాస. అటువంటి వారు ఈ పురావస్తు ప్రదర్శన శాలకు వెళితే వారికి కాలం తెలియదు. తనివి తీరదు. పోలవరం సమీపంలోని రుద్రమకోట ప్రాంతంలో 10 లక్షల సంవత్సరాల నాటి ఆదిమానవుడి సమాధుల్లో లభ్యమైన పనిముట్ల నుంచి పురాతన పూసలు, రాజులు వాడిన కత్తులు, డాళ్లు, శిరస్త్రాణాల వరకు మ్యూజియంలో ఆకర్షిస్తున్నాయి. పురాతన కాలం నాటి రాతి చెక్కడాలు, దేవతా మూర్తుల ప్రతిమలు, వేల ఏళ్లనాటి బంగారు, వెండి నాణేలు, టెర్రకోట పాత్రలు, పింగాణి పాత్రలు, ఇలా పాత రాతి యుగం నుంచి నవీన శిలా యుగం వరకు మన చారిత్రక ఆనవాళ్లు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. మన ప్రాంత సాహిత్య సంపదగా చెప్పుకోవడానికి తామ్ర పత్రాలు, తాళపత్ర గ్రంథాలూ, లోహాలతో చేసిన వంట పాత్రలు, కాంస్యంతో చేసిన దేవతామూర్తుల ప్రతిమలు ఇలా అనేక పురావస్తువులు కనువిందు చేస్తున్నాయి. ఈ పురావస్తు ప్రదర్శన శాల మనలను విష్ణుకుండినిలు, ఇక్ష్వాకులు, వేంగి చాళుక్యులు, రెడ్డిరాజులు, నిజాం పాలకుల పాలనా కాలానికి తీసుకెళుతుందనడంలో సందేహం లేదు. ఈ ప్రదర్శన శాలలో బంగారు అక్షరాలతో లిఖించిన ఖురాన్ గ్రంథం ఆకర్షిస్తోంది.

రూ.5 కోట్లతో నిర్మాణం

ఈ మ్యూజియం ఏర్పాటుకు నాటి ఎమ్మెల్యే బడేటి బుజ్జి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ స్థానిక అగ్రహారంలోని నగరపాలక సంస్థకు చెందిన సుమారు 1500 గజాల స్థలాన్ని కేటాయించగా, నాటి చీఫ్ సెక్రటరీ ఐవైఆర్ కృష్ణారావు, ఆర్కియాలజీ శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ సహకారంతో రూ.5 కోట్ల నిధులతో నిర్మించారు. కేవలం గ్రౌండ్‌ఫ్లోర్ మాత్రమే కాక మొదటి అంతస్తులో సైతం పలు వస్తువులను ఏర్పాటు చేశారు. రాజమండ్రి, కాకినాడల్లోని మ్యూజియంలలో ఉన్న కొన్ని వస్తువులను జిల్లా ప్రజల కోసం ఇక్కడికి తరలించారు. ఈ మ్యూజియంను వచ్చే జనవరి నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ మ్యూజియంపై అవగాహన కలిగించడం కోసం విద్యార్థులు, సందర్శకులను అనుమతిస్తున్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం



మ్యూజియంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందు కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని మ్యూజింలోని కొన్ని చిత్రపటాలను క్యూర్‌కోడ్ స్కాన్ చేసి ఆ చరిత్రను చూడవచ్చు. మ్యూజియంలో కియోస్క్‌ను వినియోగించి పురాతన చరిత్ర గురించి మరింతగా తెలుసుకునే వెసులుబాటు కల్పించడం అభినందనీయం.

– టీకేఎస్ఆర్ అయ్యంగార్, సామాజికవేత్త

ప్రాచీన వస్తువులుంటే సమర్పించండి



పురావస్తు ప్రదర్శన శాల ఏర్పాటుకు ఎంతోమంది సహకరించారు. జిల్లా ప్రజలకు ఇక్కడి చరిత్ర గురించి తెలుసుకునే అవకాశం ఈ మ్యూజియం ద్వారా ఏర్పడింది. 10 లక్షల ఏళ్ల నాటి వస్తువులతో పాటు 4, 5 శతాబ్దాల నాటి వస్తువులను కూడా ఒక్కడ అందుబాటులో ఉంచాం. ప్రాచీన వస్తువులను మ్యూజియంకు సమర్పిస్తే వారి పేరున ప్రదర్శిస్తాం.

– కె.తిమ్మరాజు, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట భద్రత


ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్థానిక ఈవీఎంల గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఏలూరు కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వీవీప్యాట్‌లు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఎస్ భరత్ (బీఎస్పీ), అచ్యుత్ (టీడీపీ), నెరుసు నెలరాజు (బీజేపీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పోస్టర్ ప్రదర్శన


పోస్టర్ ప్రదర్శనను పరిశీలిస్తున్న అధ్యాపకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవంబర్ 25 నుంచి ఈ నెల 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయీ చేతన 3.0 లో భాగంగా మూడవ వారం బాల్య వివాహాలను అరికట్టడం అనే అంశంపై పోస్టర్ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అధ్యక్షతన విద్యార్థులు సంబంధిత అంశంపై పోస్టర్లను ప్రజెంట్ చేశారు. కార్యక్రమంలో సమన్వయ కర్త టీవీఎస్ పద్మావతి, అధ్యాపకులు ఎస్ సుశ్యలత, డి.సుజాత, కావ్య శ్రీ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు పురస్కారంపై హర్షం

ఏలూరు (టూటౌన్): పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ గురువారం హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మీనారాయణ గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తూ.. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో అనేక బాధ్యతలు నిర్వహించి 2023 నుంచి జాతీయ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన రచించిన దీపిక అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటికి సాహితీ విమర్శ కేటగిరీలో జాతీయ సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని పేర్కొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న భజంత్రీ శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్) : మున్సిపల్ కార్మికులకు బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో యలగాడ దుర్గారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్మికులకు జనరల్, స్పెషల్ ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవ్ బిల్లు బకాయిలు, పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన లీవ్ ఎన్ కాష్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల ఫిబ్రవరి నెల హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. 2025 సంవత్సరానికి కార్మికుల యూనియన్ సభ్యత్వాలు సకాలంలో చెల్లించాలన్నారు. సీపీఐ శత వార్షికోత్సవ వేడుకల్లో మున్సిపల్ కార్మికులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యలగాడ శివకుమార్, బంగారు రాజు, కెంగం దుర్గారావు, కరపాటి నాగరాజు, కాకాని సుబ్బారావు, అల్లం పెద్దిరాజు, ఎం ప్రసాద్, అంతరాజు ఉమా, పేదారి వంశీ, మరియ దాసు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా ఏలూరు నియోజకవర్గానికి చెందిన ఐదుగురికి స్థానం కల్పించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నెరుసు చిరంజీవి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షునిగా ఏలూరు ఆంజనేయులు, ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది స్టాన్లీ బాబు, ట్రేడ్ యూనియన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పల్లి శ్రీనివాస్, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌కే షమీమ్‌లు నియమితులయ్యారు.

వైద్య ఖర్చుల పరిమితిని పెంచాలి


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా ఉపాధ్యాయ, ఉద్యోగులకు అందిస్తున్న వైద్య ఖర్చుల పరిమితి ప్రస్తుతం రూ.2 లక్షలు నుంచి రూ.10 లక్షలకు పెంచాలని పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా నాయకులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ వివరాలను నాయకులు ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి వైద్య ఖర్చుల బిల్లులు రూ.50 వేలు వరకే జిల్లా స్థాయిలో మంజూరు చేస్తున్నారని, రూ.50 వేలు దాటిన బిల్లులను రాష్ట్ర స్థాయికి పంపుతున్నారని, దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలోనే రూ.1 లక్ష వరకు బిల్లులు ఆమోదించేలా తగిన ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. ఈహెచ్ఎస్ ద్వారా రాష్ట్రంలో ఉన్న అన్ని గుర్తింపు ఆసుపత్రుల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అన్నిరకాల వైద్య పరీక్షలతోపాటు మందులు కూడా ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ త్వరితగతిన మంజూరు ఉత్తర్వులతో పాటు సొమ్మును సంబంధిత ఎక్కౌంట్‌లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, నాయకులు పామర్తి ఏసురాజు, ఎం రాంబాబు, ఎస్‌డీ ముర్సలీన్ ఉన్నారు.

సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యం


క్యాలెండర్లను విడుదల చేసిన న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): న్యాయవాదుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి నిరంతరం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) పోరాటం చేస్తుందని అసోసియేషన్ జిల్లా ప్రతినిధి బండి వెంకటేశ్వరరావు అన్నారు. ఐఏఎల్ జాతీయ సమితి ముద్రించిన 2025 టేబుల్ క్యాలెండర్, జేబు క్యాలెండర్లను గురువారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద న్యాయవాదులు, ఐఏఎల్ ప్రతినిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, ఐఏఎల్ ఏలూరు జిల్లా కోర్టు నాయకులు వాకాడ రాజారావు, పీపీ శాస్త్రి మాట్లాడుతూ ఐఏఎల్ ఇండియాలో ప్రారంభించిన నాటి నుంచి న్యాయవాదుల హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు పీఎస్ చందు, ఏలూరు బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అబ్బినేని విజయకుమార్, మాజీ కార్యదర్శి నాగరాజు, న్యాయవాదులు కానాల రామకృష్ణ, చిక్కా భీమేశ్వరరావు, రత్నం, బలగం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం


ఉంగుటూరు సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ అచ్యుత అంబరీష్

ఉంగుటూరు: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అన్నారు. గురువారం ఉంగుటూరు పంచాయతీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రికార్డుల్లో పేర్ల మార్పు వెంటనే చేస్తామని, 22ఏ వంటి సమస్యల పరిష్కారానికి సమయం పడుతుందని చెప్పారు. తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి బండారు సింధులు మాట్లాడారు. సమావేశంలో పట్టాదార్‌పాస్ పుస్తకాల మార్పుకు మూడు, అడంగల్‌కు ఆరు, పట్టా సబ్ డివిజన్ కోసం ఒకటి, పేరు మార్పునకు ఒకటి, మ్యుటేషన్ ఆన్‌లైన్‌కు రెండు, సర్వే, ఆన్‌లైన్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

భీమడోలు: భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సూరప్పగూడెంలో చేపట్టనున్న భూముల రీ సర్వేపై రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ గ్రామంలోని భూ వివరాలను సిద్ధం చేసుకోవాలని, ఈ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలకు రైతులకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వోలు, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

చిరిగిన గోనెసంచుల స్థానంలో కొత్తవి ఇస్తున్నాం

ఏలూరు(మెట్రో): ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు గోనె సంచులను అందుబాటులో ఉంచుతున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి గురువారం తెలిపారు. ఒకవేళ చిరిగిన సంచులు వచ్చాయంటే వాటి స్థానంలో కొత్త సంచులను అందిస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులుంటే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశామని వారు పేర్కొన్నారు.

షా వ్యాఖ్యలపై నిరసన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం స్థానిక వసంత మహల్ సెంటర్లో ఆయన ఆధ్వర్యంలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తగూడెం ఫీడరు మరమ్మతుల నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుకాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లివారి వీధి, మేకవారి వీధి, కబేళా ప్రాంతం, తూర్పు వీధి శివాలయం ప్రాంతం, సాయిబాబా గుడి పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన నరేష్ (55) అనే వ్యక్తిని గత నెల 22న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. అతన్ని తణుకు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేష్ తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై వైద్యులు ఎంఎల్‌సీగా నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

- లింగపాలెం మండలం రంగాపురంలో పనులు నిమిత్తం బీహార్ నుంచి వచ్చిన సోనూకుమార్ (20) అనే యువకుడు మోటారు సైకిల్‌పై బుధవారం ఏలూరు వస్తుండగా రంగాపురంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోనుకుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

అనుమానంతో వ్యక్తిపై దాడి

ఏలూరు టౌన్: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కక్షతో భర్త ఓ వ్యక్తి పై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక గొల్లాయిగూడానికి చెందిన కాలి రాజేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి తంగెళ్లమూడిలో కారు డ్రైవరుగా పనిచేస్తున్న మహ్మద్ అక్రమ్ భార్య పరిచయమైంది. వీరిద్దరూ వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో గతంలో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఐనా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈనెల 18న స్థానిక కెనాల్ రోడ్డులో అంబికా సెంటరు సమీపంలో రాజేష్‌పై మహ్మద్ అక్రమ్ ఆయుధంతో బలంగా దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మల్బరీ తోటల పెంపకం లాభదాయకం


నడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న వాణి

పెదవేగి : మల్బరీ తోటల పెంపకం లాభదాయకమని పట్టు పరిశ్రమ జిల్లా శాఖ ఉపసంచాలకులు బి.వాణి అన్నారు. గురువారం పెదవేగి మండలం నడిపల్లి గ్రామంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వాణి మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ పంటల్లో ఒకటైన మల్బరీ తోటలు పెంపకం ద్వారా నికరమైన ఆదాయాన్ని తక్కువ రోజుల్లో పొందవచ్చని వివరించారు. కుటుంబ సభ్యుల ద్వారానే సాగు చేసుకుని పట్టుని తీసుకోవచ్చని, మార్కెట్ ధర, రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రకాల పారితోషికాలను ఇస్తుందని తెలిపారు. పట్టు పరిశ్రమ ద్వారా పెదవేగి మండలం వేగివాడ, కన్నాపురం దెందులూరు మండలం రామారావు గూడెంలలో రైతులు ప్రతి నెలా మంచి ఆదాయం పొందుతున్నారని విజయరాయి పట్టు పరిశ్రమ శాఖ అధికారి రంగారావు తెలిపారు. కార్యక్రమంలో రైతులు మట్టా ఏడుకొండలు, మద్దాల ఆనందరావు, మేక నారాయణరావు, మద్దాల డేవిడ్ రాజు, చిన్నల రాఘవేంద్రరావు, పెనుమనూరి పుల్లయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	10
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	44	బీన్లచిక్కుడు	80
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	44
బెండకాయలు	44	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	60
కాకర కాయలు	30-34	బీట్‌రూట్	50
బీరకాయలు	48	కీరా దోస	44
బీరకాయలు (పందిరి)	00	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	30	అల్లం	70
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	42	పాలకూర	10
బంగాళదుంపలు	38	చుక్కకూర	10
ఉల్లిపాయలు	50	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	07
దోసకాయలు	30	పుదీనా	05
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	36